క్లుప్తంగా

నేడు ఢిల్లీ పాలలక్ష్మమ్మకు విశేష పూజలు

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతలలో కొలువైన ఢిల్లీ పాలలక్ష్మమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన




చేజర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై చేజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి మెహతాబ్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనతకు గురవకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ చంద్రయ్య, పీహెచ్‌ఎన్ రమణమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



జలదంకి: మండల జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల కుటుంబ సభ్యులను ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ మూల వెంకటరమణారెడ్డి గురువారం పరామర్శించారు. జెడ్పీటీసీ తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కావలిలోని నివాసానికి చేరుకుని జెడ్పీటీసీ కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఎల్‌ఆర్‌అగ్రహారం సర్పంచ్ పరుసు శంకరయ్య కుటుంబ సభ్యులను తాగేటివారిపాళెంలోని నివాసంలో పరామర్శించారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



ఆత్మకూరు: నెల్లూరుపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ ఆలయాన్ని పునర్నిర్మించి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నూతన పోలేరమ్మ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీస్థాయిలో అన్నదానం చేశారు. శుక్రవారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబుల్‌రెడ్డికి మద్దతుగా యూటీఎఫ్, సీపీఎం, సీఐటీయూ నాయకులు గురువారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, యూటీఎఫ్ నాయకులు శివ కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ విజయవంతానికి కృషి

ఆత్మకూరు: ఆత్మకూరు కోర్టులో శనివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు విశేష కృషి చేస్తున్నారు. కోర్టుల్లోని పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు ప్రతి రెండు నెలలకోసారి జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కక్షిదారులకు సమయం, నగదు వృథా కాకుండా ఇరువర్గాలకు న్యాయం చేస్తుండడంతో లోక్‌అదాలత్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్, స్పెషల్ మేజిస్ట్రేట్ రామకృష్ణయ్య పిలుపు మేరకు డీఎస్పీ ఎస్ కోటారెడ్డి, సీఐ కే నాగేశ్వరరావు, మండల పోలీసు అధికారులు, న్యాయవాదులు అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

గృహసారథులు సంక్షేమ వారధుల్లా నిలవాలి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి రూరల్: గృహసారథులు సంక్షేమ వారధుల్లా నిలవాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌ఎస్‌ఆర్ కళ్యాణమండపంలో మండల సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో గడప గడపకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజాసమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. తద్వారా రాబోయే ఎన్నికల్లో రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ భవాని

కావలి : పట్టణంలోని శాంతినగర్‌లో కృష్ణ బలిజ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని నూతన భవన నిర్మాణానికి తన వంతుగా రూ.2లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ కొల్లా భవాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణ బలిజలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్నీ కులాల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి తాము అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరుచేసిందని తెలిపారు. తాను మరో రూ.2 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలోని కృష్ణబలిజలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి తన గెలుపులో కీలక పాత్ర పోషించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణబలిజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పట్టణంలోని కృష్ణ బలిజ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



సంగంలో పంటలను పరిశీలిస్తున్న జేడీఏ

సంగం: మండలంలోని పడమటిపాళెం, సిద్దీపురం గ్రామాల్లో ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి కే సుధాకర్‌రాజు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయాధికారులు, వీఏఏలకు సూచనలు చేశారు. ఈ నెల 20వ తేదీలోగా ఈక్రాప్ నమోదు, ఈకేవైసీని చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏడీఏ నర్సోజీరావు, ఏఓ ఎన్ శ్రీహరి, వీఏఏలు లావణ్య, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని గొల్లపల్లిలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదును జేడీఏ సుధాకర్‌రాజు గురువారం తనిఖీ చేశారు. ఈక్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏడీఏ నర్సోజీరావు, ఏఓ శశిధర్, వీఏఏ కౌసల్య ఉన్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలి



సచివాలయ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని

జలదంకి: ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు చేరువయ్యేలా విస్తృత అవగాహన కల్పించాలని కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని సూచించారు. మండలంలోని అన్నవరం సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. సచివాలయ ఏఎన్‌ఎం సేవలపై ఆరా తీశారు. ఆయుష్మాన్ భారత్, చిన్నారుల ఆరోగ్యం, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు తదితరాలపై గ్రామ ప్రజలతో మాట్లాడారు. వైద్యసిబ్బంది మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీధర్‌బాబు ఉన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబు



ముస్తాబవుతున్న రామలింగేశ్వరస్వామి ఆలయం

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులో ఊరకొండపైనున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి రోజు ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, 11 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, 3 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

1340 గృహాలు మంజూరు



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వెంకటదాస్

వింజమూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలానికి 1,340 గృహాలు మంజూరైనట్లు హౌసింగ్ పీడీ వెంకటదాస్ తెలిపారు. వింజమూరులోని బీజీకేఆర్ ఎస్టీ కాలనీ వద్దనున్న జగనన్న కాలనీ లేఅవుట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 లేఅవుట్లు వేయగా, 1,340 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ మహేష్,వర్క్ ఇన్‌స్పెక్టర్ సందీప్, తదితరులు ఉన్నారు.

ఐదు లీటర్ల సారా పట్టివేత



అల్లూరు: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట సెంటర్ వద్ద 5 లీటర్ల సారాను పట్టుకున్నట్లు కోవూరు సెబ్ సీఐ నరహరిరావు గురువారం తెలిపారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన ఆకుల సతీష్, ఉష దంపతులు. వారు గుర్తుతెలియని వ్యక్తి వద్ద పది లీటర్ల సారాను రూ.4 వేలకు కొనుగోలు చేశారు. బోగోలు మండలం జువ్వలదిన్నె, సిద్ధనపాళెం గ్రామాల్లో 5 లీటర్లను విక్రయించారు. అనంతరం ఉడ్‌హౌస్‌పేట మీదుగా మోటార్‌సైకిల్‌పై వెళ్తూ తనిఖీలు నిర్వహిస్తున్న సెబ్‌సిబ్బందిని గుర్తించి తప్పించుకునేందుకు యత్నించగా వెంబడించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు, వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 14500 , 94409 02524 నంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సెబ్ ఎస్సైలు బాలకృష్ణ, టీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు రెండోదశ పనులను ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి గురువారం పరిశీలించారు. నార్త్, దళితవాడ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించి హెచ్‌ఎంలకు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. హెచ్‌ఎంలు ఎస్టీ హుస్సేనీ, జాఫర్‌మోహిద్దీన్, మహ్మద్‌గౌస్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, సందానీ బేగం, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు

కావలి రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ముగ్గురిని కావలి కోర్టులో హాజరుపరచగా ఏడు రోజుల జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు కావలి రూరల్ సీఐ ఎం రాజేష్ గురువారం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడిపితే జైలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని కోరారు.

11న తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష

మర్రిపాడు: కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరంలో 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అందుకు సంబంధించిన హాల్‌టికెట్లను నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు. నవోదయ విద్యాలయంలో కూడా హాల్‌టికెట్లను పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే 89850 07588, 94903 77829, 94935 14644 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్‌బీకేల్లో తనిఖీలు

వరికుంటపాడు: ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జీ కిరణ్ కోరారు. మండలంలోని గణేశ్వరపురం, తూర్పురొంపిదొడ్ల రైతుభరోసా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వీఏఏలకు సూచనలు చేశారు. ఆర్‌బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కియోస్క్ వినియోగంపై రైతులు అవగాహన కల్పించాలన్నారు. కియోస్క్ ద్వారానే ఎరువులు, పురుగుమందులను బుక్ చేసుకునేలా రైతులను చైతన్యపర్చాలన్నారు. ఈక్రాప్, ఈకేవైసీ, లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పవన్, శిరీషా పాల్గొన్నారు.

సొసైటీ రుణాలు సకాలంలో చెల్లించాలి

వరికుంటపాడు: సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని వరికుంటపాడు సొసైటీ సీఈఓ ఎం రత్తయ్య కోరారు. గురువారం ఆయన సొసైటీలో రుణ బకాయి ఉన్న వివిధ గ్రామాలకు చెందిన రైతులకు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 643 మంది రైతులు రుణ బకాయిలు కలిగి ఉన్నారన్నారు. రూ.కోటి పంట, రూ.68లక్షలు దీర్ఘకాలిక రుణ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. పంట రుణాలు పొందిన రైతులు మార్చి 31లోగా వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. మార్టిగేజ్, ఎస్టీఓ, ఎల్‌టీ రుణ బకాయిదారులు వడ్డీ, వాయిదాల నగదు చెల్లించాలని కోరారు. రుణ బకాయిలు చెల్లించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



అల్లూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీరామకృష్ణ



సోమశిల: రైతులకు అవగాహన కల్పిస్తున్న డీటీ శ్యామలాదేవి

సోమశిల: అన్నదాతలు పండించిన ధాన్యాన్ని దళారులను విక్రయించి మోసపోవద్దని పౌర సరఫరాల శాఖ డీటీ శ్యామలాదేవి సూచించారు. అనంతసాగరం మండలంలోని కొత్తపల్లి, పాతదేవరాయపల్లి రైతుభరోసా కేంద్రాల్లో ఏఓ పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం సాధారణ రకానికి క్వింటాకు రూ.2040, గ్రేడ్-ఏ రకానికి రూ.2060 వంతున మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. మిల్లర్లతో ఎటువంటి సంబంధం లేకుండా ఆర్‌బీకేల ద్వారా నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని వివరించారు. రైతులు ఆర్‌బీకేల్లో ముందస్తుగా పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు.రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ అన్నదాత వెంకట రమణరావు, సర్పంచ్ షేక్ రమీజాబేగం, వీఏఏ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

అల్లూరు: ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందించేందుకు రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీరామకృష్ణ కోరారు. బీరంగుంట ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై గురువారం అవగాహన కల్పించారు. ఏఓ వేణుగోపాల్‌రావు, వైస్‌ఎంపీపీ సురేంద్ర, నార్త్‌ఆములూరు సర్పంచ్ షేక్ కరిముల్లాషాఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబ సముద్ర స్నానానికి విస్తృత ఏర్పాట్లు



బందోబస్తు ఏర్పాట్లపై ఈఓ ఉషశ్రీతో చర్చిస్తున్న సీఐ గిరిబాబు

దుత్తలూరు : నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు అమ్మవారి సముద్రస్నానానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు. నర్రవాడలోని వెంగమాంబ ఆలయం వద్ద ఉదయగిరి సీఐ గిరిబాబు తన సిబ్బంది కలిసి గురువారం బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సముద్రస్నాన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నర్రవాడలో వెంగమాంబ గ్రామోత్సవం నిర్వహిచనున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం అమ్మవారి ఊరేగింపు దేవస్థానం నుంచి బయల్దేరి దుత్తలూరు మీదుగా సాగి రాత్రికి కావలిలోని శివాలయం చేరుకుంటుందని వివరించారు. ఆదివారం ఉదయం కొత్తసత్రం సముద్రతీరంలో అమ్మవారి సముద్రస్నాన మహోత్సవం జరుగుతుందన్నారు. సముద్రతీరం వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

వెంగమాంబకు రూ.23.95లక్షల రాబడి

వెంగమాంబ ఆలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ హక్కులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కోవూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో ఈఓ ఉషశ్రీ ఆధ్వర్యంలో గురువారం వేలంపాటలు, టెండర్లు నిర్వహించారు. బహిరంగ వేలంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కును రూ.23,95,786కు కనుమూరుకు చెందిన కోల శ్రీనివాసులు దక్కించుకున్నాడు. మిగిలిన హక్కులకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేశారు. వేలంలో ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వెన్నవాడలో మాట్లాడుతున్న వల్లభనేని రాజేంద్ర

ఆత్మకూరురూరల్: గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర సూచించారు. మండలంలోని రామస్వామిపల్లి, కరటంపాడు, వెన్నవాడ, వాశిలి సచివాలయాల పరిధిలోని గృహసారథులు, వలంటీర్లతో గురువారం వారు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



కలిగిరి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గీతారెడ్డి



వరికుంటపాడులో..



కావలిలో ఐరన్ సిరప్‌ల పంపిణీ

కావలి రూరల్: రక్తహీనతను అధిగమించేందుకు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని రాజీవ్‌నగర్ పీహెచ్‌సీ డాక్టర్ మేఘనాథ్ సూచించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష పథకం కింద గర్భిణులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని తెలిపారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలని కోరారు. మూఢ నమ్మకాలను వీడి వైద్యుల సలహాలను పాటించాలన్నారు. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఐరన్ సిరప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేబీ విశ్రాంత అధ్యాపకుడు మల్లికార్జున, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ డీ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం సుధాకర్‌రావు, సామాజిక కార్యకర్త మాల కొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

18మంది గర్భిణులకు వైద్యపరీక్షలు

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష పథకంలో భాగంగా 18 మంది గర్భిణులకు వైద్యాధికారిణి కరిష్మా వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ ఎండీ రియాజ్, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిగిరి: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతారెడ్డి సూచించారు. కలిగిరి పీహెచ్‌సీలో 28 మంది గర్భిణులకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. ఐరన్, కాల్షియం మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు.

పోలీస్ బందోబస్తు నడుమ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బొల్లినేని

కొండాపురం: మండలంలోని సాయిపేటలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎట్టకేలకు పోలీసు బందోబస్తు నడుమ టీడీపీ నేతలు గురువారం ఆవిష్కరించారు. టీడీపీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని రామారావు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేయాలని ఆయన వర్గమైన కుంకు మోహన్‌రావుకు సూచించారు. అయితే బొల్లినేని వ్యతిరేక వర్గమైన దామా మహేష్, కొమ్మి ప్రభాకర్ బుధవారమే విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వెళ్లడంతో ఇరువర్గాల నడుమ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఎస్సై ఖాజావలి తన సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేసి ఇరువర్గాలతో చర్చించి కావలి డీఎస్పీ ఎవరికి అనుమతిస్తే వారు విగ్రహావిష్కరణ చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఇరువర్గాల వారు కావలి డీఎస్పీని కలిసారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు బొల్లినేని రామారావు పోలీసు బందోబస్తు నడుమ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని వర్గవిభేదాలతో ఇలా ఆవిష్కరించడంపై అక్కడకు వచ్చిన కొందరు టీడీపీ నాయకులు, అభిమానులు ఆవేదన చెందారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.